క్లుప్తంగా

పట్టణాభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న చైర్మన్

రాయికల్: పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. మంగళవారం పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో మూడో ప్యాకేజీలో భాగంగా రూ 2.30 కోట్లతో 43 రోడ్లకు శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. అంతేకాకుండా ప్రతి వార్డులో మురికికాలువలు నిర్మిస్తున్నామమని తెలిపారు. అనంతరం ఈనెల 8న నిర్వహించే ఊరూర చెరువుల పండగను విజయవంతం చేయాలని కౌన్సిలర్లను కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, తురగ శ్రీధర్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలి



ప్రచారం చేస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: బడీడు పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. మన ఊరి మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోధూర్‌లో ఎంపీపీ, ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, మంచి విద్యను అందిస్తున్నారని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గొల్కొండ నాగరాజు, నాయకులు జాజాల జగన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి పుస్తకాలు తోడ్పడతాయి



పుస్తకాలు అందజేస్తున్న అధ్యాపకులు

జగిత్యాల: మానసిక వికాసానికి పుస్తకాలు ఎంతో తోడ్పడతాయని జిల్లా బీసీ సంక్షేమాధికారి సాయిబాబా అన్నారు. మంగళవారం ప్రముఖ రచయిత ఎంవీ.నర్సింహారెడ్డి రచించిన గ్రంథాలను ఎస్‌పీఎల్‌ఎన్‌ఆర్ కళాశాల కరస్పాండెంట్ అధ్యాపకులు సంక్షేమాధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తెలంగాణ కవులు, రచయితలు ఎన్నో గొప్పగొప్ప రచనలు చేశారని, వారికి దశాబ్ది ఉత్సవాల్లో ఆహ్వానించుకోవడం సైతం జరుగుతుందన్నారు. ఇలాంటి గ్రంథాలు చదివితే మనసుకు ఎంతో ఉల్లాసంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వేణుగోపాల్, ఓంప్రసాద్, జయరాజ్, రమ్య, ధరణి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సందీప్‌రావు

జగిత్యాలరూరల్: నిరుపేద యువతి వివాహానికి రూ.10 వేల ఆర్థికసాయం అందించి కల్లెడ సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. కల్లెడ గ్రామానికి చెందిన సుద్దాల భీమయ్య రాజవ్వ దంపతుల కుమార్తె జల వివాహం త్వరలో కానుంది. యువతి తండ్రి మృతి చెందడం, తల్లి అనారోగ్యంతో బాధపడుతుండడంతో జల వివాహానికి మంగళవారం రూ.10 వేల ఆర్థికసాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంచాల గంగన్న, రాజేశం, శ్రీను, మల్లయ్య, అంజి, పావని, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బోగ శ్రావణి పూజలు

రాయికల్: మండలంలోని కొత్తపేటలో నూతనంగా ప్రతిష్ఠించిన రేణుకాఎల్లమ్మతల్లి ఆలయంలో మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

డేంజర్ చౌరస్తా

- స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేక వాహనదారుల ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఇబ్రహీంపట్నంలోని ఇందిరాగాంధీ చౌరస్తా

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు డబుల్ రోడ్లు వేసినప్పటికీ ప్రధాన కూడళ్ల వద్ద ఏలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి రావడానికి జాతీయ రహదారి నుంచి ఉన్న సింగిల్ రోడ్డును 10 ఏళ్ల క్రితం డబుల్‌రోడ్డుగా మార్చారు. దీంతో వాహనాలు అతివేగంగా వస్తూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద నాలుగు గ్రామాలకు వెళ్లే రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చారు. ఈ చౌరస్తా నుంచి మెట్‌పల్లికి, ఇబ్రహీంపట్నం నుంచి గోదూర్ మీదుగా నిర్మల్, ఖానాపూర్‌కు, ఇబ్రహీంపట్నం నుంచి మూలరాంపూర్, ఇబ్రహీంపట్నం నుంచి వర్షకొండ మీదుగా నిర్మల్ జిల్లాకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. మహారాష్ట్ర నుంచి నిర్మల్ జిల్లా మీదుగా ఇబ్రహీంపట్నం నుంచి ఇతర జిల్లాలకు తక్కువ దూరం అవుతున్నందునా చాలా మంది ఈ రోడ్డుపై ప్రయాణిస్తు ఉంటారు . అయితే ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ఏలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు లేక వాహనాలు అతివేగంగా వస్తున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది గోదూర్ వైపు నుంచి భైంసాకు వెళ్తున్న ఓ కారు బైకును ఢీ కొట్టడంతో ఓ మహిళకు, యువతికి తీవ్ర గాయాలయ్యాయి. కోమటి కోండాపూర్‌కు చెందిన దంపతులను కారు ఢీకొనడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. ఈ చౌరస్తా గుండా నిత్యం బైక్‌లతో పాటు భారీ వాహనాలు అతివేగంగా వెళ్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు

ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద నాలుగు గ్రామాలకు వెళ్లే రోడ్లు ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఇక్కడ ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల చౌరస్తాగా మారింది. దీనిపై అధికారులకు ఎన్నో సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద వాహనాలు అతివేగంగా వస్తున్నాయి. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు పెట్టాలి.

– సాయిరాంగౌడ్, ఇబ్రహీంపట్నం

ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి



చౌరస్తా వద్దనే మా షాపు ఉంది. నిత్యం వాహనాలు వేగంగా వెళ్తుండడతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చౌరస్తా వద్ద ప్రమాదాలు జరగకుండా, వాహనాలు వేగంగా వెళ్లకుండా చర్యలు చేపట్టాలి.

– పోలకొండ సుధాకర్‌వర్మ, ఇబ్రహీంపట్నం

రక్షణ చర్యలు తీసుకుంటాం



ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. 20 రోజుల్లోగా చౌరస్తాకు నాలుగు వైపులా రోడ్లపై ట్రంబుల్ స్ట్రిప్‌లు ఏర్పాటు చేస్తాం. తరువాత ఇరువైపులా రోడ్లకు ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తాం.

– వేణు,ఆర్‌అండ్‌బీ ఏఈ, మెట్‌పల్లి

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మల్లాపూర్: సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో నేడు యువత సామాజిక మాధ్యమాల వలయంలో చిక్కి చెడుమార్గాల వైపు దారిమళ్లుతున్నారన్నారు. యువత, విద్యార్థులే లక్ష్యంగా దుండగులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఎవరైనా మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు తిరుపతి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మంగళవారం మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాలలో జరుగుతున్న దశాబ్ది ఉత్సవాలు, అభివృద్ధిపై చర్చించారు.

'భారత్ బచావో' సదస్సు విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ధర్మపురి: ప్రజా చైతన్యమే లక్ష్యంగా జిల్లా కేంద్రంలో ఈనెల 10న చేపడుతున్న భారత్ బచావో సదస్సును విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పేట భాస్కర్ కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ న్యాయ సేవాసమితి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పారపెల్లి రాజమల్లయ్య ఆధ్వర్యంలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. మన దేశంలో మనుస్మృతి తీసుకువచ్చేందుకు కుట్రలు పన్నుతున్న కేంద్రప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని అన్నారు. భారత్ బచావో సదస్సుకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక బోధకులు మహ్మద్ షేక్ హుస్సేన్, భారత్ బచావో జిల్లా కోఆర్డినేటర్ పిట్టల నారాయణ, నాయకులు అన్వేష్, కంచె రవీందర్, గాజుల గణేశ్ పాల్గొన్నారు.

కుల సంఘాల అభ్యున్నతికి కృషి

మెట్‌పల్లి: ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సహకారంతో పట్టణంలో కుల సంఘాల అభ్యున్నతి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత అన్నారు. స్థానిక బుక్క అయ్యవారు సంఘ భవన నిర్మాణానికి రూ.4.50 లక్షల నిధులు మంజూరు కాగా, మంగళవారం ప్రొసీడింగ్ కాపీని సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల సంఘాల అభ్యున్నతికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్లు పురుషోత్తం, కిషోర్ తదితరులున్నారు.

చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలి



చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం గ్రామాల్లో నిర్వహించే చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో ప్రభు కోరారు. మంగళవారం మండలంలోని అమ్మక్కపేట, వర్షకొండ, డబ్బా, కొమటికొండాపూర్, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో చెరువులను పరిశీలించారు. చెరువుల వద్ద కట్ట మైసమ్మకు చేసేందుకుగాను మండలంలోని 11 చెరువులకు ప్రభుత్వం రూ.3.6 లక్షలు మంజూరు చేసిందని లిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో వినోద్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పానకంటి వెంకట్, ఉపసర్పంచ్ మంగినిపెల్లి లక్ష్మణ్, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

సారంగాపూర్: తెలంగాణ సమగ్ర శిక్షా విద్యా విభాగంలో 15 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నామని, తమ ఉద్యోగాలను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని కోరుతూ సారంగాపూర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం కాంప్లెక్స్ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఎనగంటి వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీసీవో తిరుపతి, సీఆర్‌పీలు మాధవి, రవి, శోభ పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల: విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలని రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో టాస్క్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు మహేంద్ర ప్రైడ్ క్లాస్‌రూమ్ సెషన్స్‌లో నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థి దశ అంటే చదువుతో పాటు సమాజ శ్రేయస్సు కోరే విధంగా, తల్లిదండ్రులకు గౌరవం తెచ్చేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో టాస్క్ మేనేజర్ అయిల్నేని గంగప్రసాద్, డైరెక్టర్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపల్ మునీందర్‌రెడ్డి, టాస్క్ కో–ఆర్డినేటర్ రషీద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ పరామర్శ

ధర్మపురి: మండలంలోని నేరెళ్ల ఎంపీటీసీ రెడ్డవేని సత్యం తండ్రి సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం బుగ్గారం జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ ఎంపీటీసీ సత్యం ను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచులు వసుందర, రాజు, బీఆర్‌ఎస్ నాయకులు కొమురయ్య, వేణు పాల్గొన్నారు.

జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కార్యదర్శిగా మల్లికార్జున్

మెట్‌పల్లి: జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కార్యదర్శిగా మండలంలోని వేంపేటకు చెందిన శ్రీరాముల పురుషోత్తంను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాజా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులు చిలివేరి రామకృష్ణ, రుద్ర శ్రీనివాస్‌లకు పురుషోత్తం కృతజ్ఞతలు తెలిపారు.

మల్లెగుట్ట దారికి మోక్షం కలిగేనా?



మల్లెగుట్టకు వెళ్లే దారి

మల్యాల: మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి కొలువైన మల్లెగుట్టకు వెళ్లేదారి పొడవున గులకరాళ్లు ఉండడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అడుగుతీసి అడుగు వేయలేనంతగా బండరాళ్లు ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఒగ్గు పూజారులు కలిసి గుట్టపైకి భక్తులు ఎక్కేందుకు అనువుగా దారి వేసుకున్నారు. సీసీరోడ్డు వేస్తే భక్తుల వాహనాలు నేరుగా దిగువ మల్లన్న గుడి వద్దకు వెళ్లొచ్చు. దీంతో భక్తుల రద్దీ కూడా పెరిగే అవకాశం ఉంది. మల్లెగుట్టపైకి సుమారు 150 మీటర్లు సీసీ రోడ్డు వేసేందుకు నాలుగేళ్ల క్రితం ప్రతిపాదనలు చేసినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. సాధారణ ఎన్నికలకు ముందే సీసీ రోడ్డు వేయాలని భక్తులు కోరుతున్నారు.

చిత్ర కథ — పాత బస్టాండ్‌లో తాగునీటికి ఇబ్బందులు



రాయికల్: పట్టణంలోని పాత బస్టాండ్, గాంధీ చౌక్, శివాజీ ఏరియాలో తాగునీటి కోసం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు తీవ్రతరం అవుతున్న సమయంలో పాతబస్టాండ్‌లోకి వచ్చే 32 గ్రామాలకు చెందిన ప్రయాణికులకు తాగునీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటిని కొనుకునే పరిస్థితి నెలకొంది. ప్రతీ ఏడాది మున్సిపల్ ఆధ్వర్యంలో చలివేంద్ర ఏర్పాటు చేసేవారు. ఈ వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్ల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

ధర్మపురి: పట్టణంలో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ రమేశ్‌కు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు వేరు వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల్లో ఎన్నికలు ఉన్నాయని ప్రభుత్వం 9 ఏళ్ల కే దశాబ్ది ఉత్సవాలను జరుపుతుందని, మున్సిపాలిటీలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్మపురిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని, మిషన్ భగీరథ పనులను పూర్తిచేయాలని, కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే వారికి సత్వరం పనులు పరిష్కరించాలని కోరారు. వార్డుల్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, తమ్మల్లకుంటలో నీరు నింపాలని, ధర్మపురిలో కుక్కలు, కోతుల బెడద రోజు రోజుకు పెరిగిపోతుందని, దీనిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, జక్కు పద్మ, గరిగె అరుణ తదితరులున్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్, డీఈవో

కథలాపూర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బీమారం మండలం వెంకట్రావుపేటలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి జిర్స్ స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్ అంగడి ఆనంద్ రూ. 2 లక్షలు విరాళం ఇవ్వగా, పనులను మంగళవారం ప్రారంభించారు. తన తండ్రి అంగడి జాన్ 17వ వర్ధంతి సందర్భంగా స్మారకార్థం రూ. 2 లక్షలు ప్రహరీ నిర్మాణానికి అందించినట్లు ఆనంద్ పేర్కొన్నారు. ఆనంద్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాదేవి, సర్పంచ్ కాటిపెల్లి జగన్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఉదయగిరి రమ్య, సింగిల్‌విండో చైర్మన్ కానుగంటి శ్రీనివాస్, బంగారు దీపక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అంగన్‌వాడీలో హరితహారం

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాధవి, సరిత, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్‌లో ఎస్సీ కాలనీలో మురికి కాలువ నిర్మాణం కోసం మండలపరిషత్ నిధులు రూ. 1.15 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిధుల మంజూరు పత్రాన్ని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు బొరిగం మహేశ్‌కు ఎంపీపీ జాజాల భీమేశ్వరి అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన కంటి వెలుగు శిబిరం

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో నెల రోజులుగా నిర్వహించిన కంటి వెలుగు వైద్య శిబిరంలో 4,622 మందికి కంటి పరీక్షలు చేసి 1550 మందికి కంటి అద్దాలు అందచేసినట్లు వైద్యాధికారి శ్రీజ మంగళవారం తెలిపారు.వైద్య శిబిరం ముగియండతో సర్పంచ్ నేమూరి లత వైద్య సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీజ, ఎంపీటీసీ తిమ్మణి రాములు, సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, ఉపసర్పంచ్ రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మక్కల కొనుగోళ్లు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన మక్కల కొనుగోళ్లు ముగిసినట్లు సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, కార్యదర్శి మంత్రి సతీశ్ మంగళవారం తెలిపారు. 179 మంది రైతుల వద్ద 10,098 క్వింటాళ్ల మక్కలను కొనుగోళ్ళు చేసినట్లు పేర్కొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఇంగ్లిష్ మీడియంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని స్పెషల్ ఆఫీసర్ శోభారాణి మంగళవారం తెలిపారు. వివరాలకు 80084 76752, 83749 93157 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బడిబాట కరపత్రం ఆవిష్కరణ

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో తయారుచేసిన బడిబాట కరపత్రాలను జగిత్యాలలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, డీఈవో జగన్మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించినట్లు హెచ్‌ఎం రవీందర్ మంగళవారం తెలిపారు. పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులను వారు అభినందించారు.

దగ్ధమైన ఈత వనం పరిశీలన



ఈతవనం పరిశీలిస్తున్న సురభి నవీన్ కుమార్

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ శివారులో సోమవారం ప్రమాదవశాత్తు ఈత వనం దగ్ధం కాగా, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈత వనం దగ్ధంతో గీత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించిఆదుకోవాలని కోరారు. ఆయన వెంట యూసుఫ్‌నగర్ సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, నాయకులు అంబల్ల సుదర్శన్, వెంకట్‌రెడ్డి రాజు, వన్నెల సురేష్, రాజ్ కుమార్, రాహుల్, గౌడ సంఘం సభ్యులు ఉన్నారు.